4 నమస్తే తెలంగాణ
హైదరాబాద్
బుధవారం 19 మార్చి 2025
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

బీసీ బిల్లుల ఆమోదం

వెనుకబడిన వర్గాలకు ఆదినుంచి అన్నింటా అన్యాయం జరిగిందనేది వాస్తవం. అసలు వెనుకబడిన అనే సంబోధనే అన్యాయం. బహుజనులైనప్పటికీ ప్రాతినిధ్యంలో బీసీలు అల్పసంఖ్యాకులుగా మిగిలిపోవడం ప్రజాస్వామ్యంలో విలోమ దృశ్యం. ఇప్పటివరకు బీసీలను ఓటుబ్యాంకుగా జాతీయపార్టీలు వాడుకొని వదిలేశాయి తప్ప నిజంగా న్యాయం చేయడానికి ప్రయత్నాలు చేయలేదన్నది నిజం. దామాషా ప్రాతినిధ్యం కోసం బీసీలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నా ఆ దిశగా సరైన అడుగులు పడటం లేదు. ఈ నేపథ్యంలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం వాటా కల్పించే రెండు బిల్లులకు రాష్ట్ర శాసనసభ సోమవారం ఆమోదం తెలపడం ముదావహం. అందులో మొదటిది విద్య, ఉద్యోగాల్లో వెనుకబడిన వర్గాల రిజర్వేషన్‌ను పెంచేందుకు, రెండోది పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల్లో సీట్ల రిజర్వేషన్‌కు సంబంధించి కావడం గమనార్హం. ఈ బిల్లులకు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు తెలిపింది. మిగతా పార్టీలూ అదే వైఖరిని అనుసరించడంతో బిల్లుల ఏకగ్రీవ ఆమోదానికి మార్గం ఏర్పడింది.

బీఆర్ఎస్ మొదటినుంచీ బీసీల పక్షాన నిలిచింది. స్వరాష్ట్ర సాధన తర్వాత విశేషించి బీసీల అభ్యున్నతికి ఎన్నో కార్యక్రమాలు, పథకాలు చేపట్టింది. కులసంఘాలకు ఆత్మగౌరవ భవనాలు కట్టించడం మొదలు పశువుల కాపరుల కోసం ఉచిత గొర్రెల పంపిణీ వంటి వినూత్న కార్యక్రమాలను అమలుచేసింది. సంక్షేమ పథకాల్లోనూ బీసీలదే ప్రధానమైన వాటా కావడంతో కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి వినూత్న పథకాలు ప్రవేశపెట్టింది. చిన్నచిన్న కమతాల రూపంలో బీసీల దగ్గరే ఎక్కువ భూమి ఉన్నందున సాగు అభివృద్ధి పైనా ప్రత్యేక దృష్టితో రైతుబంధు, రైతుబీమా వంటి అద్వితీయమైన చొరవలను తీసుకున్నది. ఇప్పుడు బీసీల వాటా పెంపునకు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన బిల్లులను రాజకీయ విభేదాలకు అతీతంగా సమర్థించి తన బీసీ పక్షపాతాన్ని, హుందాతనాన్ని మరోసారి బలంగా నిరూపించుకున్నది.

ఇల్లలకగానే పండుగ కాదన్నట్టు బిల్లులు ఆమోదం పొందడమే అంతిమ విజయం కాదన్నది గుర్తుంచుకోవాలి. ఈ బిల్లుల అమలులో ఎన్నో సాంకేతిక సమస్యలున్నాయి. కోటా 50 నుంచి 70 శాతానికి పెరుగనుండటం సుప్రీం కోర్టు విధించిన పరిమితిని అధిగమిస్తుంది. దీనిపై కేంద్రాన్ని ఒప్పించి రాజ్యాంగ సవరణ చేయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నది. తమిళనాడు తరహాలో శాస్త్రీయ పద్ధతిలో పోతే అదనపు పరిమితికి రాజ్యాంగ ఆమోదం సంపాదించుకోవచ్చు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం అశాస్త్రీయమైన బీహార్ పద్ధతిలో పోతున్నది. ఇది న్యాయస్థానాల తిరస్కారానికి గురయ్యే అవకాశం ఉన్నదని బీఆర్ఎస్ హెచ్చరిస్తున్నది. సాధికారత కలిగిన బీసీ కమిషన్ల ద్వారా నివేదికలు తెప్పించుకొని, శాస్త్రీయమైన పద్ధతిలో సేకరించిన డాటా ఆధారంగా కేంద్రం వద్దకు వెళ్తే పకడ్బందీగా పనులవుతాయి. ఒకప్పుడు బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్న చరిత్ర గల కాంగ్రెస్ చిత్తశుద్ధిపై అనుమానాలు కలుగడం సహజమే. బీఆర్ఎస్ హయాంలో మార్కెట్ కమిటీల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించింది. అదేవిధంగా వైన్‌షాపుల కేటాయింపుల్లో గౌడ సోదరులకు రిజర్వేషన్ అమలు చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిలో అలాంటి అంకితభావమే కనిపించడం లేదు. అందుకే బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టుల్లో 42 శాతం రిజర్వేషన్ అమలుచేయాలనీ, బీసీలకు సబ్‌ప్లాన్ అమలుచేయాలని, బీసీలకు బడ్జెట్‌లో 20 వేల కోట్లు కేటాయించాలని బీఆర్ఎస్ సవాల్ విసిరింది. వీటిని అమలుచేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంటుందా? అనేది పెద్ద ప్రశ్న. ఆగమేఘాల మీద తూ తూమంత్రంగా సేకరించిన డాటాతో, నామమాత్రంగా బిల్లులను ఆమోదింపజేసి పంపి, ఆ తర్వాత ఎదురయ్యే అవాంతరాల పట్ల నిస్సహాయత ప్రకటించే వగలమారి ఎత్తుగడ ప్రభుత్వ వైఖరి వెనుక కనిపిస్తున్నదని చెప్పకతప్పదు. బిల్లులకు వత్తాసుగా పటిష్ఠమైన సమాచారాన్ని, వాదనలను సమర్పించడం అవసరం. విపక్షాలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నప్పుడు ప్రభుత్వం ముందుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

నోరు మంచిదైతే ఊరు మంచిదైతది!

డాక్టర్ అయాచితం శ్రీధర్
98498 93238

తెలంగాణ ముఖ్యమంత్రి భాషా వైదుష్యం పక్క రాష్ట్రాలకూ పాకింది. ఆయా రాష్ట్రాల రాజకీయ చర్చల్లో ఆయన ప్రధానంగా చోటు చేసుకుంటున్నారు. ప్రజాపాలనలో కాదు సుమా, పరుష పదజాలంలో. జాతీయ మీడియా సైతం తెలంగాణ సీఎం తిట్ల పురాణంపై దృష్టిని సారించింది. ఏదైతేనేమీ రాజకీయాల్లో ప్రత్యర్థులను విమర్శించే పాఠ్య ప్రణాళికకు ఒక వికృత అధ్యాయాన్ని జోడించారు.

ఏడాది కిందటి వరకు రాజకీయ సభల్లో ప్రవచించిన తిట్ల పురాణం ఇప్పుడు శాసనసభలోనూ ప్రతిధ్వనిస్తున్నది. రేవంత్ పరిభాషలో పదే పదే వినిపించే పదం 'బట్టలిప్పదీయడం.' వస్త్రాపహరణమే కదా కౌరవ వంశ వినాశనానికి దారితీసింది. అది మర్చిపోతే ఎట్లా? అసభ్య పదజాలంతో సీఎం దూషించినప్పుడల్లా ఖండిస్తున్నవారంతా శిశుపాలుని ప్రస్తావన చేస్తున్నారు. కానీ, శిశుపాలుడు ఇంత అసభ్యంగా మాట్లాడలేదు. రాజసూయ యాగంలో అగ్ర తాంబూలానికి శ్రీకృష్ణుడు అర్హుడు కాదని, అభ్యంతరం వ్యక్తం చేశాడు. అంతకంటే గొప్పవాళ్లు సభలో లేరా అని ధర్మరాజును ప్రశ్నించాడు. అంతేకానీ, జుగుప్సావహ బీభత్సరసాన్ని రంగరించి తిట్లందుకోలేదు. అందుకు మాఘుడనే కవి 1300 ఏండ్ల కిందట సంస్కృతంలో రాసిన శిశుపాల వధ కావ్యమే సాక్ష్యం. శిశుపాలునికి నేటి పాలకునికి పోలికే లేదు. రాజకీయాల్లో పరస్పరం విమర్శించుకున్న సందర్భంలో కొండకవో నోరుజారిన గొప్ప గొప్ప నాయకులు నాలుక కరుచుకున్న ఉదంతాలు, సవరించుకున్న సందర్భాలు లేకపోలేదు. కానీ, 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు, నా యిచ్చయే కాని నాకేటి వెరపు' అని ఓ కవి అన్నట్టు సమయం, సందర్భం లేకుండా అధికారిక కార్యక్రమాల్లో, చివరికి శాసనసభలో సైతం అభ్యంతరకరమైన తిట్ల పురాణాన్ని ప్రవచిస్తున్న సీఎం ఇకనైనా తన తీరును మార్చుకుంటే సొంత పార్టీకి, ప్రభుత్వానికి, ప్రజలకు క్షేమదాయకం. ఒకప్పుడు దేశాన్ని ఏకచ్ఛత్రంగా పాలించిన కాంగ్రెస్ నేడు మూడు రాష్ట్రాలకే పరిమితమై స్ట్రైచర్‌పై కొన ఊపిరితో ఉన్నది. చాలా రాష్ట్రాల్లో ఉనికికోసే లేదు. ఆ దుస్థితి తెలంగాణలో దాపురించకుండా ఉండాలంటే కాంగ్రెస్ అధిష్ఠానం సీఎం తిట్ల పురాణాన్ని కట్టడి చేయాలి.

> **ఈ మధ్య సోషల్ మీడియాలో ఒక పోస్టింగ్ చక్కర్లు కొడుతున్నది. గత 14 నెలల్లో సీఎం అనుచితంగా ఏయే సందర్భాల్లో మాట్లాడారో నెలల వారీగా పేర్చి చూపించారు. కడుపు మండిన రైతులు, మహిళలు, యువకులు సోషల్ మీడియా ముఖంగా మాట్లాడితే ముఖ్యమంత్రి వారి పరిభాషను తప్పుబట్టడం సరే. మరి తాను మాట్లాడిన మాటలకు ఆయన పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు సరి కదా, తన భాష సరైనదే అన్నట్టు నిండు శాసనసభలో అవే మాటలను పునరుద్ఘాటించారు.**

'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా?'. నిండు శాసనసభలో అభ్యంతరకర పదజాలం సీఎం ఉపయోగిస్తుంటే ప్రజలు అనుసరించరా? వారు సాధారణ పౌరులు. వారి ఆగ్రహ ప్రకటన సందర్భంగా పద ప్రయోగాల్లో అభ్యంతరకర పదజాలం దొర్లి ఉండవచ్చు. అది కూడా మరో వ్యక్తితో తమ బాధను పంచుకున్న ఒక సందర్భంలోనే. కానీ, ముఖ్యమంత్రి పదవి గౌరవప్రదమైనది, బాధ్యతాయుతమైనది. పవిత్రమైన ప్రజాస్వామ్య దేవాలయం. ఆ విజ్ఞత, విచక్షణ, సందర్భ శుద్ధి మర్చిపోతే ఎట్లా? ఎవరైనా తప్పు చేసినట్టు భావిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చు. తప్పు రుజువైతే తగిన శిక్ష వేసేది మాత్రం న్యాయస్థానం, ముఖ్యమంత్రి కాదు. రజాకార్లు ఎప్పుడో 75 ఏండ్ల కిందట అమాయక తెలంగాణ ప్రజలపై, స్వాతంత్ర్యోద్యమకారులపై అమలుపరిచిన రాళ్లతో కొట్టడాలు, లాగుల్లో తొండలు వదలడాలు, తొక్కి పేగులు మెడలో వేసుకోవడాలు, తోడుకల్ తీయడాలు, బట్టలిప్పి ఉరికించడాలు, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా శిక్షాస్మృతిలో చేర్చనుందేమోనన్న భయాలు ప్రజాస్వామ్యవాదులను వెంటాడుతున్నాయి. అవసరమైతే కొత్త చట్టం తెస్తానని సీఎం శాసనసభలో ప్రకటించాక ఆ భయం రెట్టింపైంది. వెర్రితనం కాకపోతే కోడి గొంతు నొక్కితే కొత్త పొద్దు ఆగుతుందా? మెటల్ డిటెక్టర్లకు ఆయుధం దొరుకుతుందేమో కానీ, ఆగ్రహం దొరకదు. పాలనొక్కటే కాదు, నాయకుని భాష, ఆహార్యం, గుణగణాలు జీవనశైలి కూడా ప్రజలను ప్రభావితం చేస్తాయి. పోకిరి సినిమాలో విలన్ అలీభాయ్ (ప్రకాశ్‌రాజ్) తాను తొక్కుకుంటూ పైకి వచ్చానని హీరో(మహేష్ బాబు)తో బెదిరింపు ధోరణిలో అంటాడు. ఆ మధ్య సీఎం రేవంత్ కూడా తొక్కుకుంటూ ఇంతదాకా వచ్చానని చెప్పుకోవడానికి వెనుక స్ఫూర్తి అదేనా?

ఇద్దరూ మహిళా యూ ట్యూబర్లు పెట్టిన పోస్టింగ్‌లో అభ్యంతరకరమైన అశ్లీలమైన పద ప్రయోగాలుండవచ్చు. అది ముఖ్యమంత్రిని మనస్తాపానికి గురిచేసి ఉండవచ్చు. ఈ విషయంలో ఎవరూ విభేదించరు. వాస్తవానికి ప్రతిపక్ష పాత్రలో పదేండ్లలో కాంగ్రెస్ పెంచి పోషించిన సోషల్ మీడియా కేసీఆర్‌ను ఆయన కుటుంబాన్ని కుళ్లపొడిచిన దాంతో పోల్చుకుంటే ఇదెంత? ఇవాళ సోషల్ మీడియా కూడా 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అన్నట్టు వ్యవహరిస్తున్నది. అసభ్య పదజాలం కాదు కూడదంటూనే సీఎం నిరంతరాయంగా ప్రయోగిస్తున్న అదే పరిభాష అతనికి శాపంగా పరిణమించి సానుభూతి లేకుండా చేస్తున్నది.

> **రేవంత్ గత లోక్‌సభలో ఓ సందర్భంలో హిందీలో ప్రసంగించినప్పుడు సభలో ఉన్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆయన హిందీని వెటకారం చేస్తూ 'కమ్ జోలీ' అనే పదాన్ని ఉపయోగించారు. ఆ పదం అసభ్యం, అశ్లీలం కాదు. అయినా రేవంత్‌రెడ్డి ఒంటి కాలు మీద లేచారు కదా! ఇతరులంటే అది తప్పు. తానంటే ఒప్పు. ఇదెక్కడి న్యాయం? ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రత్యర్థులను విమర్శించే క్రమంలో కట్టు తప్పిన సందర్భాలు చాలా ఉన్నాయి. సొంత పార్టీకి చెందిన సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య గత అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ అడిగిన పాపానికి రేవంత్‌రెడ్డి మీడియా ముందు ఎంత దారుణంగా స్పందించారో ప్రజలు చూశారు.**

ఇక కేసీఆర్‌ను ఆయన కుటుంబసభ్యులను విమర్శించే క్రమంలో రాజకీయ సంప్రదాయం అంతరించి రచ్చబండ సంప్రదాయం జడలు విప్పింది. రాజకీయాలతో సంబంధం లేని పిల్లలను, మహిళలను, వ్యక్తిగత జీవితాలను సైతం వదిలిపెట్టలేదు. సొంత పార్టీ ప్రధానులు, ముఖ్యమంత్రులే దురదృష్టకర సంఘటనల్లో విషాదకరంగా, బాధాకరంగా దివంగతులైన చరిత్ర తెలిసి కూడా ప్రతిపక్ష నేత అకాల మరణాన్ని సూచించే మార్చురీ పద ప్రయోగం ఒక ముఖ్యమంత్రి చేయడం దారుణం. ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో కేసీఆర్ కర్ర పట్టుకుంటే అవహేళన చేసిన ముఖ్యమంత్రి కర్ర పట్టుకున్న గాంధీ స్వాతంత్ర్యం తెచ్చాడని, కర్ర పట్టుకున్న బాబు జగ్జీవనరామ్ ఎమర్జెన్సీని ఎదిరించి కాంగ్రెస్‌ను తొలిసారి కేంద్రంలో గద్దె దించాడని, వీల్‌ఛైర్‌లో కూర్చొని కరుణానిధి తమిళనాడును ఎదురులేకుండా ఏలాడని, ఆరోగ్యం సహకరించకున్నా సోనియ టమ్మ పదేండ్లు యూపీఏ ప్రభుత్వాన్ని వెంట ఉండి నడిపించారని తెలియదా. పరిపాలనలో లోపాలను ఎత్తిచూపుతున్న ప్రత్యర్థులకు దీటైన సమాధానం ఇవ్వలేక వయోభారాల మీద, అనారోగ్యాల మీద, అంగవైకల్యాల మీద వెటకారాలు అమానుషం. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాన్ని నిరంతరం వెనకేసుకొస్తూ కంటికి రెప్పలా కాపాడుతున్న ఒక దినపత్రిక సంపాదకుడు, ఒక సుప్రసిద్ధ రాజకీయ విశ్లేషకుడు కూడా రేవంత్‌రెడ్డి ప్రయోగించిన స్ట్రైచర్, మార్చురీ పదాలను తప్పుబట్టారంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. పరిధులు దాటిన దూషణ నైపుణ్యమే తనను అధికారంలోకి తెచ్చిందన్న భ్రమలో సీఎం ఉన్నారేమో తెలియదు కానీ, ఆయన ఆశిస్తున్నట్టు మరోసారి సీఎం కావడానికి అదే మార్గాన్ని ఎంచుకుంటే మాత్రం అదొక రాజకీయ విషాదాంతమవుతుంది. సప్త వ్యసనాల్లో అసభ్యంగా పరుషంగా మాట్లాడటం కూడా ఒకటని మహాభారతం చెప్పింది. వ్యసనం విచక్షణ లేకుండా చేస్తుంది. మొండి వ్యాధి. తొందరగా వదలదు. వ్యసనం అంతిమ గమ్యం పతనమే.

రాజకీయాల్లో పదవి దక్కించుకోవడం కంటే నిలబెట్టుకోవడమే కష్టం. అందునా కాంగ్రెస్ పార్టీలో మరీ కష్టం. రేవంత్‌రెడ్డి తరుణ ప్రాయంలోనే ఎంతోమంది సీనియర్లను త్రోసి రాజని కాలం కలిసి వచ్చి ముఖ్యమంత్రి అయ్యారు. కానీ, ఎదురుగాలులకు నిలబడలేక ఏడాదికే తడబడుతున్నారు. అటు రాహుల్ గాంధీ దర్శనం లభించక, ఇటు సీనియర్ మంత్రుల వ్యూహాత్మక మౌనం భరించక, పరిపాలనలో దిక్కుతోచని స్థితి సహించక అన్నివైపులా ప్రతికూల పరిస్థితులు ఎదురైన నేపథ్యంలో పెల్లుబుకుతున్న మానసిక సంక్షోభం, అసహనం ఆయన మాటల్లో ప్రతిఫలిస్తున్నది. దాన్ని, పరిహరించడానికి పరిపాలనను పట్టాలెక్కించడం ప్రజామోదం పొందడం తప్ప మరో మార్గం లేదు. అంతేకానీ, దూషణలు, నిర్బంధాలు అధికారాన్ని నిలబెట్టిన సందర్భాలు చరిత్రలో ఎక్కడా లేవు మన కవి సినారె అన్నట్టు...

> **కరవాలం విసిరితే కల**
> **కోకిల కూయునా?**
> **కొరడా ఝుళిపించితే**
> **కుసుమం విరబూయునా?**

శేదువాప వోతె చేదనుభవం

"కేసీయారే మంచి 'గుండె'.. ఆయనున్నప్పుడు శేతిల పైసలాడుతుండె. గీ కాంగ్రె'సా చ్చినంక' అణా పైసుంటలేదు. అప్పు జేద్దామంటె అదాత్‌కు ఎవ్వడిత్తలేడు. అప్పిచ్చేటోడైనా పం జూసిత్తడు? మన మెట్లగడ్తమనే అనుమానం ఆనికుందదా? ఎండకాలం పంట పద్దామంటే నీళ్లిచ్చేది, ఇయ్యంది నమ్మిక లేదాయె? ఇగ రైతుబంధు బందైపాయె, పింఛన్లు జాడ, పత్తా లెవ్వాయె, ఇగ పైసలే.. శేతులెట్లుంటయి?, కేసీయారున్నప్పుడే మంచి 'గుండె'. పదో, పరకో శేతిల పైసలాడినయి, పక్కపాంటోని మొహం సూడకుంట బతికినం..." ఈ మాట ఎవరిదో తెలుసా? పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన కె.లచ్చన్నది.

***



గ్రామం, మండలం ఓడేడు ముత్తారం, జిల్లా పెద్దపల్లి. రాపెల్లి రాజయ్య నాకు పిల్లనిచ్చిన మామ పెద్ద సడ్డకుడు. తొంబై ఏండ్ల దాన్కు ఉంటడు! ఎగిలివారంగనే లేసి గూసునే పెద్దమనిషి శనారం నాడు ఇంకా లేస్తలేడని జూస్తే పెయ్యి సల్లవడి ఉన్నదట. 'ఇంట్ల మంచంలు న్నోన్ని అరుగు మీద పండవెట్టిర్'ని పొద్దున్నే ఫోన్ రానే అచ్చింది గనీ, మనకు తీరిక ఉండొద్దా కడసూపు నోసుకోవడానికి? మనం ఉండేదేమో పట్నంల, ముత్తారం 200 కి.మీ.పైనే ఉంటది. పోయి రావాల్నంటే పొంటె సరిపోతదా, పొద్దంతా గావాలె! అందుకే వీలు గాలె.

***

సావు కన్న వోలెదు, కనీసం బామ్మర్దులనన్న మందలిచ్చద్దామని బైలెల్లిన. మా పెండ్లయినంక ముత్తారం బోవుడు గిదే మొదాలు. 2025, మార్చి 2 ఐతారం పొద్దు గూకి ఐదున్నర గొడ్తున్న ది. ఓ ఇంట్లకెళ్లి మనిషి జరిగివోయిండంటె ఎంత బాధుంటదో ఎర్కే గదా? ఆ బాధను మర్చిచ్చేటందుకని ఇంత మందు వట్టుపోవుడనేది తెలంగాణల అనాదిగా వస్తున్న ఆచారం. దీన్నే ఇంకో తీరుగ జెప్పాల్నంటే శేదువాపుడంటరు. అందుకే మా బామ్మార్దులకో మందుబాటిల్, ఆ ఇంటి ఆడోళ్లకో ఛంసప్ బాటిల్ వట్టుకొని రాజయ్యింట్ల కాలువెట్టిన. నేనచ్చినన్ని తెల్సుకున్న బామ్మర్దులు ఇంటెన్క నుంచి ఉర్కిరానే అచ్చిర్రు. వాళ్లిద్ద ర్ని అల్కుకొని ఓదార్చి, ఆవల్కి పట్కుపోయిన. శేదువాపే కార్యం షురువైంది. రాజయ్య కాలంజేసిన క్రమాన్ని గురించి తెల్సుకుంట బామ్మర్దులతోని మాట్లాడుతున్న. బంజేసిన గావట్టి నేను ఛంసప్, బాపు వోయిన బాధల మా బామ్మర్దులు ఒక పెగ్గు, రెండు పెగ్గులు, మూడు పెగ్గులు.. పోస్తున్నకొద్దీ మందు పోతనే ఉన్నది. 'కేసీయారున్నప్పుడే మంచిగుండె..' అని రాజకీయాల ముచ్చట్లు దీసిండు లక్ష్మణ్ (నాకు సడ్డకుడైతడు). 'ఈడేం జేత్తున్నడు కూలగొట్టుడు దప్ప ఏం జేత్తలేడు. అడ్డకు బోసిస్తనన్నడు, ఏది బోసన్? ఆడోళ్లకు నెలకిరువైదు వందలిత్తనన్నడు ఎవ్వని? సద్వుకునే ఆడివిల్లలకు బండ్లిస్తనన్నడు ఎవ్వని?' సందియ్యకుండా మాట్లాడుతనే ఉన్నడు. 'ఎహ్హే, కాదన్నా.. ఈ మూడు రంగుల జెండా పార్టీ సారే మంచిగున్నడు. మస్తుద్యోగాలిచ్చె, కాళేశ్వరం నీళ్లియ్యవట్టె, కరెంటియ్యవట్టె..' అని నేను. 'కాదు, కాదు తమ్మి కేసీయారే మంచిగుండె' అని లచ్చ న్న. మందెక్కువైనా కొద్ది మా ఇద్దరి మజ్జన మాటలు పెర్గుతనే ఉన్నయి.

ముగ్గురు బామ్మర్దులు మా ఇద్దర్నే జూస్తున్నరు. ఇద్దరు బామ్మర్దులు మంచిగనే ఉన్నరు గని, శిన్న బామ్మర్ది రమేశ్‌కు మాత్రం మందెక్కువైంది. అప్పటిదాన్క గూత బైటికి తియ్యనోడు ఒక్కసారి నా మీదికి శివాలూగుడు షురూజేసిం డు. సీఎం సొరొచ్చి రమేశ్ ముందట గూసున్నట్టే ఊహించుకుంటున్నడు. నన్నే రేవంతు సారనుకుంటున్నడు. అనుకుంటేమాయె గని గీ కథ సూడుర్రి.. 'ఇగ్గొ ఇప్పటిదాన్క నేనేం మాట్లాడ లె. మూడు పెగ్గుల మందు వడ్డన్క గూడ నిజం మాట్లాడకుంటే నాకు నియ్యత్ లేనట్టె. ఏందేం ది? నువ్వు ముక్కమంత్రివా? అసలు నీకా కుర్చీ ల గూసునే ఐశతుందా? లేనే లేదుపో. నోట్లెకెళ్లి గూతెల్తె కేసీయార్‌ను తిడ్తున్నవ్? నీకు, కేసీయార్‌కు జమీనాస్మాన్ ఫరక్ తేడున్నది. కేసీయార్ తెలంగాణను నిలవెడ్తె, నువ్వు కూలగొడ్తున్నవ్, కేసీయార్ తెలంగాణను పచ్చగజేస్తే.. నువ్వు పడాపుంచుతున్నవ్? కేసీయార్ రైతును రాజు జేస్తే, నువ్వు రాచి రాంపాన వెడ్తున్నవ్? కేసీయా ర్ ముసలొల్లను దగ్గర్కి దీస్తే.. నువ్వు ఆ ముసలొల్లకు మూడు శెర్ల నీళ్లు తాగిస్తున్నవ్?, కేసీయా ర్ కల్యాణ లచ్మి ఇస్తే.., నువ్వు తులం బంగార మాశ వెట్టి మోసం జేసినవ్? కేసీయారున్నప్పుడు నా అసొంటి రైతులు మందుబత్తాల కోసం శెప్పులు లైన్ల వెట్టలె, నువ్వు శెప్పులు లైన్ల వెట్టే పరిస్థితిని మ్లళ తీస్కచ్చినవ్?' అని ఇరాం లేకుం ట తిట్టవట్టిండు. వశపడక బామ్మర్దులిద్దరు 'వారి రమేశా.. నీ ఎదురంగున్నది మన సతీష్ బాబరా, నువ్వు ఎవ్వలనుకుంటున్నవ్?' అని లోపలికి పట్కువోయిర్రు.

> *'బావ ఏమనుకోకు... రమేశ్‌గానికి మందెక్కువైంద'ని నన్ను సముదాయించవట్టిర్రు. 'ఏ... గదానికేమైతది తియ్యిర్రోయి. మందన్నప్పుడు ఎక్కువైతనే ఉంటది, మనిషన్నప్పుడు తూలుతనే ఉంటడు. ఆ మందే నిజాలు మాట్లాడిపిస్తద'ని పైకి గట్టిగనే అన్న గనీ, మన్సుల మాత్రం 'గోసకినా వాలెత్తు శేదువాపడానికొస్తే చేదనుభవం ఎదురాయెనెమురా?' అనుకుంటూ పట్నం బాట వట్టిన.*

***

2025, మార్చి 3 పొద్దుగాళ్ల 8 గంటలకు రింగయితున్న ఫోన్ దీస్కచ్చి నా శేతిల వెట్టింది మా ఇంటామె. ఎవ్వలా అన్నుస్తే రాపెల్లి రమేశ్ అని పేరు కనవడ్తున్నది. 'బావా.. నీకు దండం బెడ్డ జర తప్పు వట్టుకోకు, నాత్రంతా ఎటో జేసిన్నట.. కేసీయారున్నప్పుడే మంచి'గుండె' బావ, ఈ సీఎం పాడుగాను మమ్మల్ని ఇంతగనం గోసవుచ్చుకుంటున్నడు. అందుకే గంతగనం కోపమొచ్చింది. అవ్వతోడు బావ మందెక్కువైంది. ఆ నిషాల నువ్వు రేవంత్ రెడ్డివనుకొని తిట్టిన గనీ, లేకుంటే నిన్నెందుకు తిడ్త బావ' అని బతిలాడవట్టిండు. 'సరే తియ్యోయ్.. మందన్నప్పుడు ఎక్కువతనే ఉంటది, మాటన్నప్పుడు జారుతనే ఉంటది' అని ఫోన్ కట్టేసిన. 'ఏమైందుళ్లా' అని మా ఇంటామె అడుగతే.. 'గిట్లుంటయి మీ అన్నగాళ్ల కథలు'...

గడ్డం సతీష్, 99590 59041

పునర్విభజన దక్షిణాదిపాలిట శాపం

పిన్నింటి విజయ్ కుమార్
90520 39109

దేశంలో 55 ఏండ్ల తర్వాత అనివార్యంగా జరగాల్సిన లోక్‌సభ స్థానాల పునర్విభజన ప్రక్రియ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరగడం ఆనవాయితీ. కానీ, జనాభా పెరుగుదల అభివృద్ధికి అడ్డుకట్ట అని, జనాభా పెరుగుదలను అరికట్టాలని కేంద్ర ప్రభుత్వం సూచనలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు పాటించాయి. అవే ఈ రాష్ట్రాల పాలిట తీవ్ర శాపంగా మారింది. పునర్విభజన విషయంలో కేంద్రం స్పష్టమైన ముసాయిదాను ప్రతిపాదించకపోవడం దక్షిణాది రాష్ట్రాల ఆందోళనకు కారణమవుతున్నది.

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యంగ్యంగా ఒక్కో జంట 16 మంది పిల్లలను కనాలంటూ తమ రాష్ట్ర ప్రజలకు పిలుపునివ్వడం పునర్విభజన ప్రక్రియ వ్యతిరేకతకు అద్దం పడుతున్నది. ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా లోక్‌సభ స్థానాల పెంపు విషయంలో సమతుల్యతను పాటించేలా ప్రో-రేటా సిద్ధాంతాన్ని అమలు పరిచి రాష్ట్రాల వాటా కాపాడుతామని ప్రకటించారు. అయితే స్టాలిన్ ఆయన మాటలు అంతా బూటకమైనవని అభివర్ణించారు. పునర్విభజన అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే... జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాల సాఫల్యత ఆయా రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యానికే ఎసరు పెడుతున్నట్టు కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలు ఉమ్మడి పోరుకు సిద్ధమయ్యాయి. ఈ నెల 22న చెన్నై కేంద్రంగా కలిసొచ్చే దక్షిణాది రాష్ట్రాల అన్ని రాజకీయ పార్టీల నేతలతో జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) సమావేశం నిర్వహించి లోక్‌సభ సీట్ల పునర్విభజనపై రాజీలేని పోరాటం చేద్దామని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు.

స్వతంత్ర భారత చరిత్రలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను ఒకసారి పరిశీలిస్తే... 1951లో 36.1 కోట్ల జనాభాకు గాను ప్రతి 7.3 లక్షలకు ఒక నియోజకవర్గం చొప్పున 494 సీట్లు కేటాయించగా, 1961లో 43.9 కోట్ల జనాభాకు 8.4 లక్షల జనాభా నిష్పత్తితో 522 స్థానాలకు పెంచారు. చివరి సారిగా 1971లో నమోదైన 54.8 కోట్ల జనాభాకు 10.01 లక్షలకు ఒకరి చొప్పున 543 లోక్‌సభ స్థానాలకు పెంచారు. ఆ తర్వాత 1976లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో జనాభా నియంత్రణను అమలుచేస్తున్న రాష్ట్రాలు నష్టపోకూడదని, జనాభా నియంత్రణను అన్ని రాష్ట్రాలు పాటించాలన్న ఉద్దేశంతో 2021 జనగణన వరకు లోక్‌సభ స్థానాలను పెంచకుండా 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టం చేశారు. నాడు జనాభా నియంత్రణను పాటిస్తున్న రాష్ట్రాలు నష్టపోవొద్దన్న భావనతో చట్టం తీసుకువచ్చారు. ఇప్పుడు అదే చట్టం జనాభా నియంత్రణను పకడ్బందీగా అమలుచేసి, విజయం సాధించిన రాష్ట్రాల పాలిట శాపంగా మారింది. 2002లో వాజపేయి నేతృత్వంలోని ఎన్డీయే సర్కార్ 84వ రాజ్యాంగ సవరణ చేసి 2026 తర్వాత జరిగే తొలి జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాల సంఖ్య పెంచాలని నిర్దేశించింది. నాటి కేంద్ర ప్రభుత్వ సూచనలను పకడ్బ